ప్రజాశక్తి

శుక్రవారం 17 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

చేయూత కోసం వేచిచూపు



పిసినికాడ సభలో బటన్ నొక్కి నాలుగో విడత చేయూత నిధులను విడుదల చేస్తున్న జగన్ (ఫైల్)

- మహిళలకు అందని నాలుగో విడత నిధులు
- ఆందోళనలో 1.17 లక్షల మంది

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

వైఎస్ఆర్ చేయూత సాయం కోసం జిల్లాలోని మహిళలు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మార్చి 7న నాలుగో విడత చేయూత నిధులు విడుదల చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. 14 రోజుల పాటు చేయూత నిధుల జమను పండగలా జరపాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్ మార్చి 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ జారీచేయడంతో చేయూత నిధులు అందజేత ఆగిపోయింది. నిధులు సమకూర్చుకొని చేయూత నిధులు మహిళల ఖాతాల్లో జమచేయాలనుకునేలోపు షెడ్యూల్ రావడంతో ఏ ఒక్క లబ్ధిదారునికీ నేటికీ పైసా జమకాలేదు. మార్చి 7న అనకాపల్లి నియోజకవర్గంలోని పిసినికాడ సభలో నాలుగో విడత చేయూత నిధుల విడుదలకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొన్న సిఎం జగన్ మహిళలకు భరోసా ఇచ్చారు. అప్పటి నుంచి డబ్బులు తమ బ్యాంకు ఖాతాలో జమవుతాయని లబ్ధిదారులు ఈ రోజు వరకూ ఆశగా ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. వాస్తవానికి 45-60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ పేద మహిళలకు ప్రభుత్వం ఏటా ఒక్కొక్క మహిళకూ రూ.18,750 చెల్లిస్తోంది. ఇలా జిల్లాలో మూడు విడతలుగా ప్రభుత్వం చేయూత నిధులు అందజేసింది. నాలుగో విడత నిధుల విడుదల విషయంలో మాత్రం ఎన్నికలు రావడంతో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుంది. జిల్లాలో 1,17,805 మంది మహిళా లబ్ధిదారులకు రూ.220.88 కోట్లను ప్రభుత్వం జమచేయాల్సివుంది. ఈ నాటికీ అవి జమకాకపోవడంతో ఇకరావన్న ఆందోళన మహిళల్లో వ్యక్తమవుతోంది. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తే డబ్బులు జమవుతాయనే భావన వున్నప్పటికీ, ప్రభుత్వం మారితే డబ్బులు రావన్న దిగులు కనిపిస్తోంది. వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపులోపు చేయూత నిధులు జమ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. మరోపక్క రాష్ట్రంలో పోలింగ్ పూర్తవడంతో నాలుగో విడత చేయూత నిధులను ఒకటి, రెండు రోజుల్లో మహిళల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు మాత్రం చెబుతున్నారు.

వార్త 2లో..

మాట్లాడుతున్న ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి

ఐపిఎల్ తరహాలో ఎపిఎల్ వేలం

గంగవరం పోర్టు కార్మికుల సమ్మె పరిష్కారం

డిమాండ్లు నెరవేర్చేందుకు యాజమాన్యం అంగీకారం

ప్రజాశక్తి - గాజువాక : అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమ్మె పరిష్కారమైంది. విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ రవిశంకర్‌ల సమక్షంలో గురువారం సాయంత్రం ప్రారంభమైన చర్చలు రాత్రి వరకూ సాగాయి. అదానీ యాజమాన్యం, ఆర్ఆర్ కార్మికులు, నాన్ ఆర్ఆర్ కార్మికులతో దఫా దఫాల చర్చలు అనంతరం కొన్ని డిమాండ్లను యాజమాన్యం అంగీకరించింది. 500 మంది ఆర్ఆర్ కార్మికులకు వన్ టైం సెటిల్‌మెంట్‌గా రూ.27 లక్షలు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. నాన్ ఆర్ఆర్ కార్మికులపై అక్రమ సస్పెన్షన్స్, ట్రాన్స్‌ఫర్‌లు ఎత్తివేస్తామని చెప్పింది. ఇంక్రిమెంట్స్ వెంటనే వేస్తామని, వేతనాలను నాలుగు నెలల్లో పెంచుతామని, ఇతర సమస్యల పరిష్కారానికి చర్చలు చేస్తామని పోర్టు యాజమాన్యం అంగీకరించింది. యాజమాన్యం తరపున ఈ చర్చల్లో మేనేజింగ్ డైరెక్టర్ అంజిరెడ్డి, సిఎస్.రాజు, కార్మికుల తరుపున 12 మంది పోరాట కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

నాగరాజు ఆశయ సాధనకు కృషి

వార్త 2లో..

ఎన్నికలు ముగిసినా.. భద్రతపై నిర్లక్ష్యం వద్దు

వార్త 2లో..

ఇగ్నోలో అడ్మిషన్ల ప్రారంభం

వార్త 8లో..

విశాఖ పోర్టు మరో రికార్డు

45 రోజుల్లో 10 మిలియన్ టన్నుల సరుకు రవాణా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సరుకు రవాణాలో విశాఖపట్నం పోర్టు అథారిటీ పాత రికార్డులను తిరగరాస్తూ మరో నూతన రికార్డు నెలకొల్పింది. 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును కేవలం 45 రోజుల్లోనే రవాణా చేయడం ద్వారా పోర్టు 2024-25 ఆర్థిక సంవత్సరంలో సరికొత్త రికార్డును లిఖించింది. గత ఆర్థిక సంవత్సరంలో 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును 47 రోజుల్లో చేసిన రవాణాయే ఇప్పటి వరకూ రికార్డుగా ఉండేది. ప్రస్తుతం పోర్టు ఆ రికార్డును తిరగరాసింది. ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన ట్రాఫిక్ మేనేజర్ జిఆర్‌వి.ప్రసాదరావు, సిబ్బందిని పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు, ప్రశంసించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పోర్టు 90 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డు సరుకు రవాణాను సాధించడంలో కృషి చేయాలని ఆకాంక్షించారు.

రికార్డుల పరంపర

2023-24 ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి పోర్టు చరిత్రలోనే సరికొత్త రికార్డును నెలకొల్పింది. తద్వారా గతంలో చేసిన 73.75 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును తిరగరాసింది. ఈ రికార్డు విశాఖపట్నం పోర్టు సామర్థ్యాన్ని తెలియజేయడమేకాక మారిటైం సెక్టార్‌లో విశాఖపోర్టు ప్రాముఖ్యతను మరోమారు ఇనుమడింపజేసింది.

ఈ ఏడాది క్రూడ్ ఆయిల్ రవాణాలో 27 శాతం,. ఇనుప ఖనిజం రవాణాలో 12 శాతం, ఎరువుల రవాణాలో 6 శాతం మెరుగుదలను పోర్టు నమోదు చేసింది. 43 భీమ్ కలిగిన బేబీ కేప్ నౌకలు గత ఏడాదితో పోల్చుకుంటే అధికంగా ఇన్నర్ హార్బర్‌లో కార్యకలాపాలు నిర్వహించాయి. పోర్టులోకి వచ్చిన మిగతా 2లో..

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

విశాఖ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జూన్ 4న జరగబోయే కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయా నియోజకవర్గాల ఆర్ఒలకు, ఇతర అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై ఆయన చర్చించారు. పోలింగ్ అనంతరం ఆయా స్ట్రాంగ్ రూమ్‌లకు ఇవిఎంల తరలింపు, ఇతర సాంకేతిక ప్రక్రియల పూర్తి, ఇతర అంశాల గురించి ఆయా ఆర్ఒలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో చేపట్టిన చర్యలు సంతృప్తికరంగా సాగాయని, అందరూ సమష్టి కృషితో సేవలందించారని పేర్కొన్నారు. ఇదే ఒరవడిని కౌంటింగ్ ప్రక్రియలో కూడా

సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున

కొనసాగించాలని సూచించారు. ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతాపరమైన ఏర్పాట్లపై రోజువారీ సమీక్షించుకోవాలని ఆయా ఆర్ఒలకు చెప్పారు. ప్రతి రోజూ స్ట్రాంగ్ రూమ్‌లను చూసిరావాలన్నారు. పోటీ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

చేసిన అభ్యర్థులతో రోజూ సంప్రదించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్లను కూడా నిర్దేశ సమయంలో స్ట్రాంగ్ రూమ్‌లకు చేరవేయాలని, భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇతర జిల్లాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్లను వేరు చేసి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నాటికి ఎలాంటి సాంకేతిక అంశాలూ పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని, అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉండాలని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకుగాను ఆయా అధికారులకు, సిబ్బందికి శిక్షణ శిబిరాలను నిర్వహించాలని, అన్ని అంశాలపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. అందరూ సమన్వయం వహించి ఫలితాల వెల్లడిలో ఎలాంటి గందరగోళ పరిస్థితులూ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని, ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో ఎంసిసి నోడల్ అధికారి సి.ఎం.సాయికాంత్ వర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆయా నియోజకవర్గాల ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు మరో రికార్డు

నౌకలలో సైతం 35 శాతం పెరుగుదల నమోదైంది. విశాఖ కంటైనర్ టెర్మినల్ సైతం 28 శాతం అధికంగా 6.65 లక్షల టిఇయులను హ్యాండిల్ చేసింది. ముఖ్యమైన పనితీరు సూచీలలో మెరుగుదల నమోదైంది. ప్రి బెర్తింగ్ డిటెన్షన్‌లో 68 శాతం, టర్న్ అరౌండ్ టైం, అవుట్‌పుట్ పర్ షిప్ బెర్త్ డేలో 10 శాతం, ఐడల్ టైం బెర్తింగ్‌లో 8 శాతం మెరుగుదలను నమోదు చేసింది.

ఐపిఎల్ తరహాలో ఎపిఎల్ వేలం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) నేతృత్వంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) గవర్నింగ్ కౌన్సిల్ తలపెట్టిన సీజన్ - 3 టోర్నీకి సంబంధించి ఆటగాళ్ల వేలం గురువారం విశాఖపట్నంలోని గ్రాండ్‌బే హోటల్‌లో జరిగింది. కె.నితీష్ కుమార్ రెడ్డిని గోదావరి టైటాన్స్ జట్టు యాజమాన్యం వేలంలో రూ 15.60 లక్షలకు దక్కించుకుంది. ఈ వేలంలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు కేటగిరీల్లో 408 ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఈ వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్, కెవిఆర్ ఉత్తరాంధ్ర లయన్, మార్లిన్ గోదావరి టైటాన్స్, బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ గ్రూపులకు చెందిన ఆరుగురు ఫ్రాంచైజర్లు పోటీ పడ్డారు. అంతకుముందు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌ఆర్.గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎపిఎల్ ద్వారా ఆంధ్ర క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. జూన్ 30 నుంచి జులై 13వ తేదీ వరకు ఎపిఎల్ సీజన్ - 3 నిర్వహించనున్నామన్నారు. మొత్తం 19 మ్యాచ్‌లలో కడపలో 7, వైజాగ్‌లో 12 మ్యాచ్‌లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఐపిఎల్ మ్యాచ్‌ల తరహాలోనే ఎపిఎల్‌నూ నిర్వహించనున్నామన్నారు. గతంలో ఎపిఎల్‌లో ఆడిన కెఎస్.భరత్, ఎన్.నితీష్ కుమార్ రెడ్డి, రిక్కీ భుయ్, షేక్ రషీద్, పృథ్వీరాజ్, హరి శంకర్ రెడ్డి, అదేవిధంగా విమెన్ ఎపిఎల్ నుంచి స్నేహ దీప్తి, షబ్బం ఐపిఎల్‌కి ప్రాతినిధ్యం వహించారన్నారు. కార్యక్రమంలో ఎసిఎ కోశాధికారి ఎవి.చలం, ఎపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్లు జితేంద్రనాథ్ శర్మ, ఆస్కర్ వినోద్, ఆక్షన్ అధికారి నవనీత్ కృష్ణ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి రూ.లక్ష ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెదగంట్యాడ మండల పరిధిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వై.సందీప్‌కు సంజీవని నిధి (డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్) ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు విశాఖపట్నం రెవెన్యూ డివిజన్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ గురువారం సందీప్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. మందుల కొనుగోలు, ఇతర వైద్య ఖర్చుల నిమిత్తం సందీప్‌కు ఈ ఆర్థిక సహాయం సమకూర్చినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఎపి రెవెన్యూ జిల్లా అసోసియేషన్ తరపున అధ్యక్షులు ఎస్‌ఎ.త్రినాథరావు జిల్లా కలెక్టర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

బసుమతిని ఇంటికి చేర్చిన ఎయుటిడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పశ్చిమ బెంగాల్‌కు చెందిన 35 ఏళ్ల బసుమతిని విశాఖ నగరానికి చెందిన ఎయుటిడి సంస్థ ఆమె ఇంటికి చేర్చింది. వివరాల్లోకి వెళితే.. 16 సంవత్సరాలుగా బసుమతి మానసిక వ్యాధితో బాధపడుతోంది. పశ్చిమ బెంగాల్ నుంచి విశాఖకు తప్పించుకు వచ్చేసింది. కొన్ని రోజులు నగర పరిధిలోని టిఎస్‌ఆర్ అనాథల ఆశ్రయ కేంద్రంలో ఉంచి నిర్వాహకులు మందులు వాడించారు. ఆమె ఆరోగ్యం కుదుట పడటంతో కొడుకు గోపాల్ మండల్‌కు బసుమతిని అప్పగించారు. తన తండ్రి వేరే పెళ్లి చేసుకుని బెంగళూరు వెళ్లిపోయాడని, తను కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నానని, తల్లిని అప్పగించినందుకు ఆనందంగా ఉందని కొడుకు గోపాల్ మండల్ తెలిపారు. బసుమతిని శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో పశ్చిమ బెంగాల్ నదియా జిల్లాలో ఉన్న మొల్లా బెలియా గ్రామంలో ఆమె కొడుకు, కూతురు చెంతకు చేర్చినట్లు ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు.

మళ్లీ వైసిపిదే అధికారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టేది వైసిపియేనని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. లాసన్స్ బే కాలనీలోని విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైసిపి ఏకపక్ష విజయాన్ని సాధిస్తుందని తెలియజేశారు. విశాఖ వేదికగా జగన్మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని అన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినా..

భద్రతపై నిర్లక్ష్యం వద్దు

విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని

మాట్లాడుతున్న విశాల్ గున్ని

ప్రజాశక్తి - విజయనగరం కోట : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినా భద్రతపై నిర్లక్ష్యం చేయొద్దని విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని అన్నారు. ఈ నెల 13 సార్వత్రిక ఎన్నికల తరువాత జరిగిన సంఘటనలు, తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై విశాఖపట్నం రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్‌పిలు, ఇతర పోలీసు అధికారులతో ఆయన గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం, జూమ్ మీటింగు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు నెలలుగా రేంజ్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది చాలా కష్టపడి, ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పని చేయడం వల్ల ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలను చిన్న చిన్న సంఘటనలు మినహా ప్రశాంతయుతంగా నిర్వహించుకోగలిగామని చెప్పారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఎన్నికల తరువాత మన ప్రాంతం ప్రశాంతంగా ఉందన్న నిర్లక్ష్యం వద్దని, మరో 15 రోజులు ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తి, నిబద్ధతతో పని చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, ఈ ప్రాంతంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలూ ఉత్పన్నం కాకుండా క్షేత్ర స్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పోలింగుకు కొద్ది రోజుల ముందు, పోలింగు రోజు, పోలింగు తరువాత గ్రామాల్లో చోటు చేసుకున్న చిన్న చిన్న సంఘటనల పట్ల నిర్లక్ష్యం వద్దని, ఆయా గ్రామాలను అధికారులు పలుమార్లు సందర్శించాలని, గ్రామ పెద్దలు, గ్రామస్తులతో మమేకమై, వారిని వివాదాలకు దూరంగా ఉంచాలని, ఒకరితో ఒకరు శాంతియుతంగా మెలగాలని విజ్ఞప్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో చురుకుగా ఉన్న వ్యక్తులను, రాజకీయంగా వివాదాలు సృష్టించే వ్యక్తులను గుర్తించి, వారిని పోలీసు స్టేషనుకు పిలిచి, కౌన్సిలింగు చేయాలని, క్షేత్ర స్థాయిలో రాజకీయ పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల నుండి స్వగ్రామాలకు వచ్చిన వ్యక్తుల వల్ల ఏమైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉంటే గుర్తించి, వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. వివాదాలు తలెత్తేందుకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి, పోలీసు పికెట్లును ఏర్పాటు చేయాలని, ఆయా గ్రామాల్లో పరిస్థితులను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులను గుర్తించి, వారు గ్రామానికి ఏ పని మీద వచ్చినదీ, ఎందుకు వచ్చినదీ తెలుసుకోవాలని, ఆయా అంశాలను పాయింట్ బుక్కుల్లో నమోదు చేయాలని అన్నారు. ఇవిఎంలను భద్రపర్చిన స్ట్రాంగు రూమ్స్ వద్ద మూడంచెల భద్రతను ఇప్పటికే ఏర్పాటు చేసామని తెలిపారు. ఎన్నికల తరువాత వివిధ పోలీసు స్టేషన్లల్లో నమోదైన కేసులను డిఐజి సమీక్షించి దర్యాప్తులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 4న కౌంటింగు నిర్వహించే కేంద్రాల వద్ద కూడా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, వాటిని జిల్లా ఎస్‌పిలు ముందుగానే సమీక్షించాలని అన్నారు. సమావేశంలో విజయనగరం జిల్లా ఎస్‌పి ఎం.దీపిక, మన్యం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్, శ్రీకాకుళం జిల్లా ఎస్‌పి జిఆర్.రాధిక, అనకాపల్లి జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, విజయనగరం అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, శ్రీకాకుళం అదనపు ఎస్‌పి ప్రేమ్ కాజల్, పార్వతీపురం మన్యం అదనపు ఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, పార్వతీపురం ఎఎస్‌పి సునీల్ షరోన్, ట్రైనీ ఐపిఎస్ ఎం.జావలి, పలువురు డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

నాగరాజు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యుటిఎఫ్ జిల్లా నాయకులు సనపల నాగరాజు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం సంఘం జిల్లా కార్యాలయంలో సనపల నాగరాజు మూడో వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగరాజు మృతి యుటిఎఫ్‌కు, ప్రజా సంఘాల ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. యుటిఎఫ్ నిర్మాణంలో, జిల్లా ఉద్యమాలలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక ద్వారా విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేవారన్నారు. అలాగే జిల్లాలో అనేక పాఠశాలల్లో చెకుముకి పోటీలు, సైన్స్ మేళాలు నిర్వహించడం, మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యం చేయడం వంటివాటితో పేరుగాంచారన్నారు. మాధవ ధారలో ప్రజా సమస్యలపై స్థానికులతో మమేకమై ప్రజా పోరాటాలు చేసేవారన్నారు.

నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న నాయకులు

జిల్లాలో అనేక ప్రాంతాలలో శిక్షణా తరగతులు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. నేటి తరం యుటిఎఫ్ కార్యకర్తలకు, నాయకులకు ఆయన ఆదర్శప్రాయుడని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఆయన చూపిన బాటలో నడవడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాడాన అప్పారావు, జిల్లా కోశాధికారి కొత్తపల్లి రాంబాబు, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి వైఎఆర్‌కె.ప్రసాద్, పూర్వ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎం.రామకృష్ణ, పూర్వ జిల్లా కోశాధికారి సనపల స్వామి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మాధవికి ఎయు డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగ పరిశోధక విద్యార్థిని, విశాఖలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ.మాధవికి డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ఎల్‌ఎస్‌వి.ప్రసాద్ పర్యవేక్షణలో డీజిల్ ఇంజిన్లలో ఉద్గారాలను తగ్గిస్తూ వాటి సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా జరిపిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ లభించింది. బయో డీజిల్‌లో టైటానియం నానో పార్టికల్స్‌ను జోడించి ఇంధనంగా ఉపయోగించి ఈ పరిశోధనను నిర్వహించారు. ఈ మేరకు ఎయు ఉపకులపతి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
O.S.No 103/2023.

Between:
1. Sri Kaligotla Sanyasiraju,
2. Smt Navuduri Vijayalakshmi,
3. Smt Mandapaka Padmavathi,
4. Smt Amirapu Seetha Mahalakshmi.....Plaintiffs.

And:
1. Sri Randhi Demudu,
2. Sri Kaligotla Lakshmana Rao,
3. Sri Kaligotla Seetharama Raju,
4. Sri Kaligotla Venkata Ramana. ....Defendants.

To
THE DEFENDANT No 3
Sri Kaligotla Seetharama Raju S/o Late Seetharamayya, Hindu, aged about 66 years, Resident of Plot No 212, Jagveer Vegi Gardens, Opposite CMR Burial Grounds, Bhanu Nagar, H.B.Colony Post, Visakhapatnam.

Please take notice that the above named plaintiffs instituted the above matter against you and the same stands posted on **4th day of July 2024 at 10.30 A.M.** for your appearance. Further, along with the said suit, the plaintiffs also filed I.A.No 709/2023 for temporary injunction against you and the same also stands posted to 4th day of **July 2024 at 10.30 A.M** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at **10.30 A.M.**, failing which the matter will be heard and determined in your absence as experte as per law.

K.VENKATARAO
ADVOCATE,
VIZIANAGARAM

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P No. 18/2019

Between: **Potnuru Raja Rao and another** ...Petitioners
And:- **Karri Veera Venkata Krishna Reddy and 44 others** ...Respondents

To,
R-43: Tangudu Vijaya Laxmi, W/o Syamala Rao, Hindu, aged 53 years, house hold duties, resident of Door No. 3-5-6, Behind Vinayaka temple, Seethammapeta Bazar, Visakhapatnam Urban and District, Mobile No. 7396499132

పై నంబరు పిటిషనులో పిటిషనర్ తనను **Insolvent person** గా **Declare** చేయుచు మని కోరుచు పైకోర్టులో **I.P.18/2019** నంబరుగా పిటిషన్ పై దాఖలు చేయుగా, సదరు పిటిషన్‌లో పై **respondent-43** కు నోటీసు నిమిత్తం మరియు జనరల్ నోటీసు నిమిత్తం పై కోర్టు **తే 04-07-2024 దీ కి వాయిదా అయి వున్నది.** కావున ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు ఉన్నయెడల **తే 04-07-2024 దీని పగలు 10-30 గంటలకు** పై కోర్టులో హాజరై వారికి గల ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనియెడల పిటిషనర్ తరపున శ్రీ కోర్టు వారు ఆర్డరు జారీ చేయుదురని యీ బహిరంగ ప్రకటన మూలంగా జన యావన్మందికి తెలియ జేయడమైనది.

// బై కోర్టు ఆర్డర్//

ఎం.ఎస్. వినయ్ భూషణ్‌రావు
న్యాయవాది,
శ్రీకాకుళం, ఫోన్:9440112861

మండే ఎండలో వ్యాపారాలు..

▸ అరకొరగా ఆదాయం..

▸ ప్రత్యామ్నాయ ఉపాధి లేక ఏళ్ల తరబడి పండ్ల వ్యాపారం

ప్రజాశక్తి -తగరపువలస : ఏళ్ల తరబడి స్థానిక మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఎండనకా, వాననకా పండ్ల వ్యాపారం చేస్తున్నప్పటికీ జీవితంలో ఎదుగూ, బొదుగూ లేదని స్థానికంగా ఉన్న పలువురు పండ్ల వ్యాపారులు వాపోతున్నారు. రోడ్డు పక్కన తట్టలు, బుట్టల్లో కొందరు, మరికొందరు తోపుడు బళ్లపై వివిధ రకాల పండ్లను అమ్ముతున్న వ్యాపారులు తమ కష్టాలను ప్రజాశక్తికి తెలిపారు.

రోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విక్రయాలు జరుపు కుంటారు. వారంలో రెండు, మూడు సార్లు విశాఖ, విజయనగరంలోని హోల్ సేల్ మార్కెట్లకు వెళ్లి ఏక మొత్తంగా పండ్లు కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ అమ్ముతుంటారు. ఒక్కోసారి చెక్క పెట్టెల్లో వచ్చే పండ్లలో పాడైనవి ఉంటాయని, దీంతో నష్టం చవిచూడాల్సి వస్తుందని కొందరు వ్యాపారులు అంటున్నారు. 220 యాపిల్ పండ్లున్న చెక్క బాక్స్ ఖరీదు సుమారు 3వేలుపైన ధర ఉంటుందని, ముగ్గురు, నలుగురు కలిసి విజయనగరం, విశాఖ ఆటోల్లో వెళ్లి పలు రకాల పండ్లు తెస్తుంటామని పలువురు వ్యాపారులు తెలిపారు. తెచ్చుకున్న సరుకు 3, 4 రోజులకు మించి నిల్వ ఉంటే పాడైపోతుందని వారు చెబుతున్నారు.

ఆదాయ అంతంత మాత్రమే..

రోజంతా బండి వద్ద నిల్చుని వ్యాపారం సాగిస్తే వచ్చే ఆదాయం అంతంత మాత్రమేనని వ్యాపారులు చెబుతున్నారు. రెండు యాపిల్ పండ్లు రూ.30కు అమ్మితే రెండు, మూడు రూపాయల లాభం ఉంటుందని అంటున్నారు. ఒక్కోసారి వచ్చిన ధరకే అమ్ముతుంటామని తెలిపారు. ద్రాక్ష, దానిమ్మ తదితర పండ్లు అమ్ముతున్నామని వచ్చే లాభం తక్కువని అంటున్నారు.

కష్టంగా కుటుంబ పోషణ..

ఓ వైపు నిత్యావసర వస్తువుల ధరలు అందనంత ఎత్తుకు పెరుగుతున్నాయి. రోజు వారీ అవసరాలకు తగ్గట్టు ఆదాయం లేదు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని వారు అంటున్నారు. పండ్లు అమ్మే సీజన్ వేసవి, కార్తీక మాసంలోనే ఉంటుందని, మిగిలిన కాలంలో వ్యాపారం మందకొడిగా సాగుతుందని అంటున్నారు.

తగరపువలస రోడ్డు పక్కన మండే ఎండలో పండ్ల వ్యాపారం చేస్తున్న వ్యాపారులు

రుణాలు ఇప్పించండి

పండ్ల వ్యాపారం కోసం వేలల్లో పెట్టుబడి అవసరం. ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రూపంలో రుణాలు ఇప్పించి తోడ్పడాలి. కానీ ఏ ప్రభుత్వం కూడా రుణాలు ఇప్పించి ఆదుకోలేదు.

వరలక్ష్మి
పండ్ల వ్యాపారి

వేరే ఉపాధి లేకనే...

వేరే ఉపాధి అవకాశాలు లేవు. తాత తండ్రుల నుంచి ఇదే పండ్ల వ్యాపారం చేస్తున్నాం. ఆదాయం తక్కువైనా తప్పక ఇదే వ్యాపారం చేయాల్సి వస్తుంది. పిల్లల చదువులు, వైద్యం ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తుంది.

ఈశ్వరమ్మ
పండ్ల వ్యాపారి

నేరాలు ఘోరాలు

ల్యాబ్ టెక్నీషియన్ అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం ఆర్‌హెచ్.కాలనీకి చెందిన దుంగ శేఖర్ (21) నగరంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి విధులకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పిఎం.పాలెం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ స్కిల్‌డెవలెప్‌మెంట్ ప్రాంతానికి చెందిన సుమారు 70 ఏళ్ల వృద్ధుడు కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వృద్ధుడు అస్వస్థతో బాధపడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ ఏరియాలో పడి ఉండగా అటుగా వెళ్తున్న స్థానికులు అంబులెన్స్‌లో కెజిహెచ్‌కు తరలించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. వృద్ధునికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీసులను సంప్రదించాలని సిఐ గోవిందరావు కోరారు.

వాంబే కాలనీలో కూలిన మెట్లు

వాంబే కాలనీలో కూలిన మెట్లు

- తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -మధురవాడ : వాంబేకాలనీలో మెట్లు కూలిన ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం... జివిఎంసి 7వ వార్డు పరిధిలోని వాల్మీకి అవాస్ యోజన అంబేద్కర్ పథకంలో సుమారు 20 ఏళ్ల కిందట అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు 3400 ఇళ్లను 82 బ్లాక్‌ల కింద నిర్మించారు. అప్పటిలో నగరంలోని రహదారులకు ఇరువైపులా ప్రభుత్వ స్థలంలో ఉన్న వారిని గుర్తించి ఇక్కడ ఇళ్ళు కేటాయించారు. ఆ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపించడంతో బీటలు వారి, ఇళ్ల పెచ్చులు రాలిపోతున్నాయి. ఓ భవనం వద్ద గత ఏడాది మెట్లు మార్గం కూలిపోయింది. బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి 40బి నెంబర్ బ్లాక్ వద్ద మెట్లు కూలిపోయాయి. ఇది రాత్రి పూట జరగడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని భవనాలకు మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అపోలోలో అరుదైన ఆర్థో శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆసుపత్రిలో అరుదైన ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ తెలిపారు. 24 ఏళ్ల పురుషుడు గత ఏడాదిగా చీలమండ వెలుపల తీవ్ర నొప్పి, వాపుతో బాధపడుతున్నారని చెప్పారు. అతను విశ్రాంతి, నివారణ మందులు, బ్రేస్, ఫిజియోథెరపీ, స్టెరాయిడ్ ఇంజక్షన్లు వాడుతున్నా ఉపశమనం కలగకపోవడంతో తమను సంప్రదించారని తెలిపారు. ఎంఆర్‌ఐ స్కాన్ చేయగా పెరోనియల్ టెనోస్టెనోవైటిస్‌గా నిర్ధారించి టెండోస్కోపిక్ టెనోస్టెనోవెక్టమీని విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. దీంతో రోగి కోలుకొని 24 గంటల్లో డిశ్చార్జ్ చేసినట్లు వివరించారు. ఏపి రాష్ట్రంలో చీలమండ వెలుపల ఇలాంటి సున్నితమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేయడం ఇదే ప్రథమమని డాక్టర్ అబ్దుల్ డిఖాన్ వెల్లడించారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ ఖాన్‌కు, అపోలో యాజమాన్యానికి రోగి, అతని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఒక్రిడ్జ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద పంచాయతీ పరిధిలో ఉన్న ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ 10, 12 తరగతుల్లో సిబిఎస్ఇ బోర్డు పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ శైలా భమిడి పాటి గురువారం తెలిపారు. 10వ తరగతిలో విద్యార్థులు మహాలక్ష్మి, టి.సహస్రాన్విత 93.40, సోహన్ సాహు 92.80 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 12వ తరగతిలో విద్యార్థులు ఎస్.నిధి 94 శాతం, కె.మేఘన 93.4 శాతం, ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇందుకు గాను స్కూల్ డైరెక్టర్ అమిత్ కుమార్ జైన్, ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు

చేతి బోరుకు మరమ్మతులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలో ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం గ్రామంలో పాడైన బోరుకు గురువారం మరమ్మతులు చేపట్టారు. 'పాడైన బోరును పట్టించుకోరా?' శీర్షికన ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం పొడుగుపాలెం గ్రామానికి సిబ్బంది చేరుకొని వర్షంలోనే చేతిపంపుకు మరమ్మతులు పూర్తిచేశారు. ఈ చేతిపంపును బాగు చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేశారు. మరమ్మతులు పూర్తిచేసిన అధికారులకు, ప్రజాశక్తి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు

బోరు మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

క్షయ నివారణకు బీసీజీ టీకాలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగదీశ్వరరావు

ఆనందపురంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ జగదీశ్వరరావు, పరిశీలకులు నిర్మల గౌరి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : పెద్దలకు క్షయ వ్యాధి రాకుండా ఉండటానికి అందరూ బీసీజీ టీకాలు వేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు కోరారు. మండలంలోని చందక, బోయపాలెంలో పెద్దలకు వేస్తున్న క్షయ టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, టీకాల కార్యక్రమం రాష్ట్ర పరిశీలకులు నిర్మలగౌరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఒ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా గురువారం బీసీజీ టీకాల కార్యక్రమం ప్రారంభమైందన్నారు. సుగర్ వ్యాధి ఉన్నవారు, 60 ఏళ్లు నిండిన వారు, బిఎంఐ 18 లోపు ఉన్న వారు, క్షయవ్యాధిగ్రస్తుని ఇంట్లో ఉన్న ఇతర సభ్యులు, పొగ తాగే అలవాటు ఉన్నవారు, ఈ టీకాలు వేయించుకోవాలని సూచించారు. రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ నిర్మలగౌరి మాట్లాడుతూ, ఈ టీకాల కార్యక్రమం వల్ల ప్రజలు క్షయ వ్యాధి బారిన పడకుండా ఉంటారన్నారు. ఈ టీకాల కార్యక్రమం ప్రతి గురువారమూ జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన అందరికీ టీకాలు అందేలా చూడాలని ఆమె అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పుర్ణేంద్రబాబు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ ఎం.గంగునాయుడు, షహనాజ్ సాధియ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, జిల్లా కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, టిబి జిల్లా కేంద్రం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, టిబి సూపర్‌వైజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు

మధురవాడ : మధురవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యాన సచివాలయం వద్ద బీసీజీ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి ఆరోగ్య సిబ్బంది, సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం పాల్గొన్నారు.

మధురవాడలో టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

మాట్లాడుతున్న గీతం రసాయనశాస్త్ర విభాగాధిపతి వేణుగోపాల్

పరిశ్రమలకనుగుణంగా గీతం కెమిస్ట్రీ కోర్సులు

ప్రజాశక్తి -మధురవాడ : పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్రవిభాగం బోధన, పరిశోధన కార్యకలాపాలను నిర్వహిస్తోందని గీతం రసాయన శాస్త్రవిభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్.వివిఎస్.వేణుగోపాల్ తెలిపారు. నగరంలోని వివిధ కళాశాల విద్యార్థులకు గురువారం నిర్వహించిన "రసాయన శాస్త్రం- ఉజ్వల భవిష్యత్తు" సదస్సులో ఆయన ప్రసంగించారు. ఔషధ రంగం నుంచి అణు ఉత్పాదన రంగం వరకు రసాయన శాస్త్రం విస్తరించిందని పేర్కొన్నారు. ఔషధ పరిశ్రమలు లారెస్ ల్యాబ్, రెడ్డీస్ ల్యాబ్, ఫైజర్ హెల్త్ కేర్‌లతో తమ విభాగానికి అవగాహన ఒప్పందాలు ఉన్నాయన్నారు. గీతం రసాయన శాస్త్ర విభాగం ప్రముఖ పరిశ్రమలకు తగిన విధంగా కోర్సులను రూపొందిస్తోందని, ఈ కారణంగా డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. రసాయన శాస్త్రంలో నానో సైన్స్, గ్రీన్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్, ఆర్గానిక్, సింథసిస్‌లపై గీతంలో పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 100కు పైగా పిహెచ్‌డిలను విభాగం ద్వారా పరిశోధకులు అందుకున్నారని తెలిపారు. గీతం రసాయన శాస్త్ర విభాగానికి కేంద్ర పరిశోధన సంస్థలు డిఎస్‌టితో సహ సిఎస్ఐఆర్ పరిశోధన ప్రాజెక్టులను అప్పగించాయని తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

'రూ.వెయ్యి కోట్లకు చెవిరెడ్డి పంగనామం'

ప్రజాశక్తి-సీతమ్మధార : చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తనకు ఏమాత్రమూ సంబంధం లేని విశాఖకు రూ.వేయి కోట్లకుపైగా పంగనామం పెట్టారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బినామీలతో రుషికొండను విధ్వంసం చేయించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి వేల లారీల గ్రావెల్‌తో రూ.వందల కోట్లు సంపాదించాడని ఆరోపించారు. రుషికొండను తవ్వగా వచ్చిన గ్రావెల్ రాళ్లను నిబంధనలకు విరుద్ధంగా సముద్రం ఒడ్డున సిఆర్‌జెడ్ ప్రాంతంలో డంప్ చేయించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్కడి ఎర్ర మట్టిని మాత్రం విశాఖ పోర్టుకు తరలించి భారీగా లబ్ధి పొందారని తెలిపారు. పెందుర్తి నియోజకవర్గం గుర్రంపాలెంలో 200 ఎకరాల్లో క్వారీయింగ్ చేసి రూ.వందల కోట్లు సంపాదించారని ఆరోపించారు. ప్రభుత్వం పరిశ్రమలకని కేటాయించిన భూమిలో తెలివిగా మైనింగ్ చేశారన్నారు. మధురవాడ సమీపంలోని బక్కన్నపాలెం సర్వే నెంబర్ 2 లో 208 కోట్ల టిడిఆర్ బాండ్లను తాడేపల్లి ప్యాలెస్ ఒత్తిడితో దక్కించుకున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో రాజు, నాగలక్ష్మి, చౌదరి, పోతన్నరెడ్డి, పోతు వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. జివిఎంసి నాలుగో వార్డు పరిధి పాత పరదేశిపాలెం, కాపులుప్పాడ, కళ్లివానిపాలెం, మంగమారిపేట, తిమ్మాపురం, కె.నగరపాలెం, కె.దిబ్బడిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆనందపురం : పరదేశిపాలెం సబ్‌స్టేషన్ 11 కెవి బోయపాలెం, ఇండస్ట్రియల్ 11 కెవి కెకె.పాలెం, 11 కెవి పరదేశి పాలెం లైన్ మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మండలంలోని బోయపాలెం గంభీరం, గంభీరం ఎపిఐఐసి, కొత్త కళ్లివానిపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఎఇ సురేష్ తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కన్నారావు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-ఉక్కునగరం : సిఐటియు సీనియర్ నాయకుడు ఉప్పిలి కన్నారావు ఆశయాలకు పాటుపడదామని స్టీల్ జోన్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. కొండయ్యవలస సిడబ్ల్యుసిలో సిఐటియు అగనంపూడి ఏరియా కమిటీ ఆధ్వర్యాన ఉప్పిల కన్నారావు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, కన్నారావు మన మధ్యన లేకపోయినప్పటికీ ఆయన చేసిన పోరాటాలు కళ్ల ముందే కనిపిస్తున్నాయని తెలిపారు. నిర్వాసితుల ఆర్.కార్డు మార్పులని, నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని నిరంతరం పోరాటం చేశారని గుర్తుచేశారు. నిర్వాసితుల సమస్యలపై 2008లో జరిగిన పోరాటంలో రెండు రోజులు పాటు జైలుకు వెళ్లారని తెలిపారు. అగనంపూడిలో సిఐటియును బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు.

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాసు మాట్లాడుతూ, ఉప్పిలి కన్నారావు చేసిన పోరాటాల వల్ల నిర్వాసితుల్లో ఎంతోమందికి శాశ్వత ఉపాధి లభించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల తరపున నిరంతరం పోరాటం చేశారని గుర్తుచేశారు. ఈ సభలో అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, అలమండ శ్రీను, మడగల నర్సింగరావు, గోవిందరావు, అట్ట అప్పారావు, కరణం పైడిరాజు, గంగాధర్, చిత్త అబ్బాయి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

జీవనశైలి మార్పులతో అదుపులో రక్తపోటు

కిమ్స్ ఐకాన్ కార్డియాలజిస్టు డాక్టర్ కె.నారాయణరాజు

ప్రజాశక్తి -గాజువాక : జీవనశైలి మార్పులతో రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ చెందిన, ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ కె.నారాయణరాజు తెలిపారు. రక్తపోటును పెంచడం, సాధారణ స్థితిలో ఉంచడానికి జీవనశైలి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆహారం, శారీరక శ్రమ, ఒత్తిడి నిర్వహణలో లక్ష్య మార్పులు చేయడం ద్వారా, వ్యక్తులు తమ రక్తపోటును సమర్థవంతంగా తగ్గించవచ్చని తెలిపారు. ఆహార మార్పులు, ఆల్కహాల్ వినియోగాన్ని నియంత్రించడం, శారీరక శ్రమలో భాగంగా వారానికి కనీసం 150 నిమిషాల పాటు చురుకైన నడక, హైకింగ్ లేదా స్విమ్మింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామాలలో పాల్గొనడం వల్ల రక్తపోటు తగ్గుతుందని వివరించారు. గుండెను బలోపేతం చేయడానికి, ప్రసరణను మెరుగుపరచడానికి, ఒత్తిడిని తగ్గించడానికి వ్యాయామం సహాయపడుతుందని తెలిపారు. అధిక శరీర బరువు రక్తపోటు, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. ఎలివేటెడ్ రక్తపోటు దాదాపు ఒత్తిడితో పాటు ఉంటుందని, దీర్ఘకాలిక ఒత్తిడి రక్తపోటు ప్రమాదాన్ని పెంచుతుందని వివరించారు. ధ్యానం, శ్వాస వ్యాయామాలు, యోగా ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తాయని తెలిపారు.

కొన్ని సందర్భాల్లో, రక్తపోటును నియంత్రించడానికి జీవనశైలి మార్పులు సరిపోకుంటే వైద్యుని సంప్రదించాలని సూచించారు.

కూటమి నేతలకు పల్లా కృతజ్ఞతలు

ప్రజాశక్తి -గాజువాక : ఎన్నికల్లో తన తరుపున పనిచేసిన కూటమినేతలకు గాజువాక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. గాజువాకలో గురువారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 57 రోజులుగా అలుపెరగకుండా కూటమి విజయం కోసం పడిన శ్రమకు ఫలితం రానుందని చెప్పారు. సంక్షేమం పేరుతో బటన్ నొక్కుతూ, పన్నుల పేరుతో సామాన్యుల గొంతు నొక్కిన జగన్మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో ప్రజలు వ్యతిరేక ఓటు వేశారని తెలిపారు. రానున్న ఫలితాలతో వైసిపి చాప చుట్టేస్తుందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం యువత పడిన తాపత్రయం ఎన్నికల్లో కనిపించిందని తెలిపారు. ప్రజలు తిరగబడితే ఎలా ఉంటుందో తెనాలిలో జరిగిన ఘటనే రుజువు చేస్తుందన్నారు. ఎన్నికల్లో అక్కడక్కడా చిన్నచిన్న పొరపాట్లు తలెత్తినా వాటిని సరిచేసుకొని అందరినీ కలుపుకొని ముందుకు వెళతానని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

'గుంటూరు' రాజశ్యామల యాగం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి గుంటూరు నరసింహమూర్తి దంపతులు విశాఖ నగరంలోని ఓ ఆలయంలో రాజశ్యామల అమ్మవారి యాగాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోకకల్యాణార్థం కోసం ఈ పూజ చేసినట్లు చెప్పారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆనందపురం : ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా చందక గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, దోమలు వృద్ధి చెందకుండా ప్రజలంతా కృషి చేయాలని కోరారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారమూ డ్రై డే పాటించాలని సూచించారు. క్షయ వ్యాధి టీకాల కార్యక్రమం రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ నిర్మల గౌరి మాట్లాడుతూ, లార్వా దశలోనే దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ పుర్ణేంద్రబాబు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎం.గంగునాయుడు, షహనాజ్ సాదియ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, జిల్లాకేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి నాగ భూషణం, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : లార్వా దశలోనే దోమలను నివారించాలని గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధాకర్ సూచించారు. డెంగీ వ్యాధి నివారించాలని కోరుతూ గురువారం గాజువాకలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ టి.నాగప్పారావు, ఎంపిహెచ్ఎస్ జి.రాము, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ : శతశాతం డెంగీ నివారణే లక్ష్యమని గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్, కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గాయత్రి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణకు అవగాహనకు ఆయా పిహెచ్‌సిల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. డెంగీ, మలేరియావంటి వ్యాధులకు కారణమైన దోమలు, వాటి లార్వాలు నియంత్రణకు చర్యలు చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు.

కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం అన్న నినాదంతో కశింకోటలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ దోమలు మంచినీరు నిల్వ ఉన్నచోట గుడ్లుపెట్టి అభివృద్ధి చెందుతాయని, అవి పెరగకుండా ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. నీరు నిల్వ చేసే పాత్రలు ప్రతి వారం ఖాళీ చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం, దోమతెరలు వాడటం చేయాలని కోరారు. జ్వరం వస్తే రక్త పరీక్షలు చేసుకుని, చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్నడిఎం అండ్ హెచ్ఒ జగదీశ్వరరావు, నిర్మల గౌరి తదితరులు

తాళ్ళపాలెంలో..

కశింకోట మండలం తాళ్లపాలెం పిహెచ్‌సి ఆధ్వర్యాన గురువారం డెంగీ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి యు.రమేష్, విస్తరణ అధికారి సుబ్బారావు, ఆరోగ్య బోధకులు ప్రసాద్, సిబ్బంది నరసింహరావు, వెంకట లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రి జనరిక్స్‌లో రసాయనాలు పడి కార్మికునికి తీవ్ర గాయాలు

- బాధితునికి సిఐటియు నేత రాము పరామర్శ
- మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఈజెడ్ పరిధిలోని సింబయో జనరిక్స్ ఫార్మా పరిశ్రమలో బుధవారం రాత్రి ప్రమాదం చోటుచేసుకుంది. నైట్ షిఫ్ట్ విధులు నిర్వహిస్తున్న పశ్చిమ బెంగాల్‌కి చెందిన కాజల్ బౌరీ అనే కార్మికుని ముఖంపై ప్రమాదవశాత్తు రసాయనాలు పడడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కార్మికుడిని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ బాధిత కార్మికుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు సంభవించి కార్మికులు గాయాలు పాలైనా ఫ్యాక్టరీ ఆఫ్ ఇన్స్పెక్టర్, లేబర్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు మెరుగైన సేఫ్టీ పరికరాలు అందిస్తే ఇటువంటి ప్రమాదాలు నివారించవచ్చన్నారు. పరిశ్రమ యాజమాన్యాలు లాభాలే పరమావధిగా కార్మికుల ప్రాణాలను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమలలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రక్షణ కల్పించే విధంగా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, గాయపడిన కార్మికుడికి మెరుగైన వైద్య సేవలు అందించి కార్మిక కుటుంబాలు ఆదుకోవాలని కోరారు.

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సిఐటియు నేత రాము

పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

ఇవిఎం స్ట్రాంగ్ రూముల భద్రతపై అప్రమత్తం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూముల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్ట్రాంగ్ రూము భద్రత పట్ల సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల కేంద్ర బలగాలను, జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీస్ బందోబస్తుకు సూచనలు చేస్తూ స్ట్రాంగ్ రూముకు నిరంతర సీసీ కెమెరా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. స్ట్రాంగ్ రూముకు కిలోమీటర్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు భద్రతా సిబ్బంది పూర్తిగా అప్రమత్తతగా ఉండాలని సూచించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు నిరంతరం సిబ్బందిని ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

అడ్మిషన్ పత్రం అందిస్తున్న గురుకులాల సమన్వయకర్త రూపాదేవి

గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సబ్బవరం

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని సబ్బవరం, దేవరాపల్లి, గొలుగొండ, శ్రీకృష్ణాపురం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లు కొరకు గురువారం ప్రవేశ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్బవరం కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్‌వివి సత్యారావు మాట్లాడుతూ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఇప్పటికే ఆన్లైన్ విధానంలో సీట్లు భర్తీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన సీట్లు మెరిట్ ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా భర్తీ చేసినట్లు తెలిపారు. ఈ అడ్మిషన్ కౌన్సిలింగ్ కొరకు సుమారు 200 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. బాలురు గురుకులాల్లో 188 సీట్లు ఖాళీలు ఉండగా అందులో కౌన్సిలింగ్ ద్వారా 81 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు తెలిపారు. ఈ అడ్మిషన్ కౌన్సిలింగ్‌కు ఉమ్మడి జిల్లా గురుకులాల సమన్వయకర్త యస్. రూపవతి కౌన్సిలింగ్ చైర్మన్‌గా, బాలురు గురుకులాల ప్రిన్సిపల్స్ ఆర్ రామకృష్ణ, సిహెచ్ రవీంద్రనాథ్, వి రత్నవల్లి కమిటీ మెంబర్లుగా వ్యవహరించారు.

లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

ముగ్గురికి తీవ్ర, ఇద్దరికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - కశింకోట

కశింకోట మండలం ఎన్‌జి.పాలెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున విజయవాడ నుండి శ్రీకాకుళం వెళుతున్న ఎన్ఎల్ 07బి 0642 నెంబర్ గల ప్రైవేట్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణం చేస్తున్న అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన ఎం.ఈశ్వర్ (15), గుడివాడ చెంచుపేటకు చెందిన ఆర్.అనురాధ (45), పామర్రుకు చెందిన కనుమూ నాగమూర్తి (33)కి తీవ్ర గాయాలయ్యాయి. అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన ఎం.పెంటారావు, గుడివాడ చెంచుపేట చెందిన రేగాని కృష్ణ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులు నాగమూర్తి విశాఖ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలోనూ, ఆర్.అనురాధ, రేగాని కృష్ణ అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలోనూ, ఈశ్వర్, పెంటారావు అనకాపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రిలోనూ చికిత్స పొందుతున్నారు. బస్సు ముందు భాగంగా నుజ్జు నుజ్జు అయింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. కశింకోట ఎఎస్ఐ రమణమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ముందు భాగం నుజ్జు అయిన దృశ్యం

అక్రమ అరెస్టులు దారుణం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనంతపురం జిల్లాలో సిపిఐ, ఎఐటియుసి నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఏఐటియూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పోలింగ్ అనంతరం రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో దాడులు, అల్లర్లు జరుగుతున్నాయని, అనంతపురం జిల్లా తాడిపత్రిలో డిఎస్‌పి వివిఎస్ కె చైతన్య ప్రత్యేక పోలీసు బలగాలతో టిడిపి నేత జెసి ప్రభాకరరెడ్డితో సహా పలువురు తెలుగుదేశం సానుభూతిపరుల ఇళ్లను ముట్టడించి వీరంగం సృష్టించడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనలో వికలాంగుడైన కిరణ్ తలపై డిఎస్‌పి చైతన్య లారీతో బలంగా కొట్టడంతో తీవ్ర గాయమై కిరణ్ పరిస్థితి విషమంగా మారిందని, ఆయన్ను పరామర్శించేందుకు గురువారం వెళ్లిన సిపిఐ అనంతపురం జిల్లా కార్యదర్శి సి. జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, సి. మల్లికార్జునలతో సహా సిపిఐ, ఎఐటియుసి నేతలను అరెస్టు చేయడం దారుణమన్నారు.

భవనాల అక్రమ నిర్మాణదారులకు నోటీసులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం మండలం వెదురువాడ, మోసయ్యపేట గ్రామాలలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాల కూల్చివేయుట జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి అమ్మాజీ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. మోసయ్యపేటలో అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ దారులకు గురువారం ఆమె స్వయంగా నోటీసులు అందజేశారు. నోటీసు అందుకున్న ఏడు రోజులలో ఏటువంటి వివరణ ఇవ్వని పక్షంలోనూ, మీరు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోయినా వుడా అధికారులతో వచ్చి అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తామని పేర్కొన్నారు.

ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం తీడ గ్రామం వద్ద ఏలేరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 42 -45 సంవత్సరాలు వయస్సు ఉండవచ్చని, మృతుడు నలుపు రంగు షర్టు, తెలుపు రంగు చొక్కా వేసుకొని ఉన్నారని పోలీసులు తెలిపారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై ఎఎస్ఐ కె.దొర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌టిపిసి సింహాద్రిలో 'స్వచ్ఛతా పఖ్వాడా'

ప్రజాశక్తి - పరవాడ

ఎన్టీపీసీ సింహాద్రిలో 'స్వచ్ఛత పఖ్వాడా' కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈనెల 16 నుండి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా తెలిపారు. ఈ సందర్భంగా సవ్యాస్ భవనంలో ఉద్యోగుల చేత పరిశుభ్రత గురించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సిన్హా మాట్లాడుతూ పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సిజిఎం సిపిజి -3 రష్మీ రంజన్ పరిదా, జిఎం ఆపరేషన్ మెయింటెనెన్స్ సురేష్ జాన్ డేవిడ్, జిఎం విపిజి నోవాహు గద్దం, జిఎం టెక్నికల్ ఎస్ పద్మప్రియ, హెచ్‌ఆర్ హెడ్ బిబి పాత్ర, జిఎమ్‌లు, హెచ్‌ఒడిలు, యూనియన్, అసోసియేషన్ ప్రతినిధి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌టిపిసి అధికారులు, కార్మికులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌లో మార్పులు చేయాలి

జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌లో మార్పులు చేయాల్సి ఉందని, దీనికి మేధావులైన న్యాయవాదులు పూనుకోవాలని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ అన్నారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. చట్టాలు ప్రజలకు మేలు చేసేలా దుర్మార్గులపై ఉక్కు పాదం మోపేలా ఉండాలన్నారు. ప్రస్తుతం ఏపీలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలైతే సామాన్యులపై దుష్ప్రభావం చూపుతుందని చెప్పారు. జ్యుడీషియరీ లేకుండా అధికారం అంతా ఎగ్జిక్యూటివ్ చేతుల్లో పెడితే రాజకీయ నాయకులు ఆడింది ఆట పాడిందే పాటగా ఉంటుందని తెలిపారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అనకాపల్లి బార్ ఆధ్వర్యంలో 100 రోజులు నిరసన చేపట్టడాన్ని అభినందించారు. అనంతరం ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అధ్యక్షులు ఎంజెవిఎన్ కుమార్, సెక్రెటరీ దుర్గారావు, ఉపాధ్యక్షులు రోజా, కోశాధికారి సందీప్, స్పోర్ట్స్ సెక్రటరీ మోహన్, లైబ్రేరియన్ జగపతి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మల్లేష్, రామచంద్రరావు, నరసింహం, తేజ, లీలాలను కండువాలతో అభినందించారు. సీనియర్ న్యాయవాదులు రామచంద్రరావు, రమణయ్య, శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు లక్ష్మీనారాయణను సత్కరించారు.

లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న న్యాయవాదులు

పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. క్విజ్ పోటీలు నిర్వహించి, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. ఆటల పోటీలు తదితర కార్యక్రమాలను ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని శాఖా గ్రంథాలయం అధికారి ఓ. శ్రీనివాసరావు తెలిపారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సాలాపు సత్యనారాయణకు నివాళి

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని సాలాపు వానిపాలెం మాజీ సర్పంచ్ సాలాపు సత్యనారాయణ మూడవ వర్ధంతి కార్యక్రమం గురువారం గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు ముఖ్య అతిథిగా పాల్గొని సత్యనారాయణకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలబాబు మాట్లాడుతూ సర్పంచ్గా గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారని, రామాలయం పునర్నిర్మాణానికి శక్తివంచన లేకుండా పని చేశారని తెలిపారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సాలాపు మోహన్, సాలాపు చిన్న వెంకటరమణ, గొర్లి గోవింద, ఎస్ఎం నాయుడు, సాలాపు ఈశ్వర్, సాలాపు అప్పారావు, గల్లా వెంకట అప్పారావు, సాలాపు వెంకట అప్పారావు, సాలాపు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో విషాదం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండల కేంద్రం బుచ్చయ్యపేట గ్రామానికి చెందిన గాడి పరసయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. బుచ్చయ్యపేట గ్రామానికి చెందిన గాడి పర్సయ్య, భార్య రమణమ్మతో కలిసి పాడేరు మోదమాంబ అమ్మవారి దర్శనానికి వెళుతుండగా పాడేరు మండలం ఘాట్ రోడ్డులో వాహనం ఢీకొనడంతో పర్సయ్య మతి చెందాడు. భార్య రమణమ్మ తీవ్రంగా గాయపడింది. గ్రామంలోని ప్రతి కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉండే పర్సయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో రాజీవ్ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట

నేవల్ టెక్నాలజీ డే సందర్భంగా నేవల్ సైన్సు టెక్నాలజికల్ లేబరేటరీ అండ్ డిఫెన్సు రీసెర్చ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ వారు విశాఖపట్నంలో నిర్వహించిన సైన్సు ఎగ్జిబిషన్లో స్థానిక రాజీవ్ గాంధీ ఆర్ఈసిఎస్ పాలిటెక్నిక్ కళాశాల మొదటి సంవత్సరం ఈఈఈ విద్యార్థులు ద్వితీయ బహుమతి పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శివ గురువారం మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్లో డ్రైవర్ యాంటీ స్లీప్ డిటెక్టర్ ప్రాజెక్టుకు ప్రదర్శించగా, ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రాజెక్టుకు గైడెన్స్ ఇచ్చిన కళాశాల లెక్చరర్ బిఎస్వి నగేష్కు కాలేజీ యాజమాన్యం, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

వీధి కుక్కల స్వైర విహారం

- ప్రధాన రహదారిపై అడ్డదిడ్డంగా సంచారం
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు
- గ్రామ సింహాల నియంత్రణ చర్యలు శూన్యం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం మండల కేంద్రంలో కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. ప్రధాన రహదారిపై కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. చికెన్, మటన్ సెంటర్లలో వ్యర్థ పదార్థాలు పక్కన పడేయడంతో వాటిని తింటూ రోడ్లపై పరుగులు పెడుతున్నాయి. గాజువాక-ఎలమంచిలి, పూడిమడక-అనకాపల్లి ప్రధాన రహదారులలో ఎస్ఇజెడ్లోని పరిశ్రమల్లో పనిచేయటానికి వేలాది మంది కార్మికులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ ఉంటారు. వీధి కుక్కలు రోడ్డుపై అడ్డదిడ్డంగా తిరగడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారులపై కుక్కలు సడన్గా రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. అలాంటి సమయాల్లో బ్రేకులు వేస్తే వెనుక నుండి వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. అలాగే కొన్ని సందర్భాల్లో సడన్గా బ్రేకులు పట్టక కుక్కలను గుద్దుకొని ద్విచక్ర వాహనదారులు కింద పడిపోయి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడంతో పాటు–ాళ్లు, చేతులు విరిగి నెలల తరబడి చికిత్సలు తీసుకుంటూ విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోంది. ఆ రోజుల్లో వేతనాలు కోల్పోవడంతో పాటు వైద్యానికి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. అంతేకాకుండా రహదారులపై రాకపోకలు సాగించే పాదచారులను కుక్కలు కాటు వేస్తున్నాయి. కుక్క కాటు వేసిన వెంటనే వైద్యులను సంప్రదించని పక్షంలో ర్యాబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ర్యాబిస్ వ్యాధి సోకినవారు ప్రాణాలతో బతికి బట్టకట్టడం కష్టం. గతంలో గ్రామాల్లో కుక్కలను పంచాయతీ ఆధ్వర్యంలో పట్టించి దూర ప్రాంతాలకు తరలించేవారు. అయితే కొన్నేళ్లుగా పట్టించుకోవడం లేదు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, పలువురు కార్మికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

అచ్యుతాపురం ప్రధాన రహదారిపై సంచరిస్తున్న వీధి కుక్కలు

ఉపాధి హామీ కూలీలకు

రోజు కూలి రూ.300 చెల్లించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు 300 రూపాయలు చొప్పున కూలి డబ్బులు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రవరం గ్రామంలో గురువారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగా రోజుకు 300 రూపాయలు చొప్పున ఇవ్వాలన్నారు. పనిచేస్తున్న కూలీలకు స్లిప్పులు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండువేసవిలో పనిచేస్తున్న కూలీలకు సేద తీరడానికి టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీరు పంపిణీ చేయాలని, 30శాతం వేసవి అలవెన్స్ అదనంగా చెల్లించాలని, వారానికి ఒకసారి కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కూలికి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కార్మికులు అప్పారావు, సీత, లక్ష్మి, కొండమ్మ, సింహాచలం, అప్పలనరస తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము

అందరూ మెచ్చే ప్రభుత్వమే వస్తుంది

ప్రజాశక్తి-దేవరాపల్లి

జూన్ 4 తర్వాత అందరూ మెచ్చే ప్రభుత్వమే రాబోతుందని మాడుగుల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ, మాడుగుల మండలాల్లోని కూటమి శ్రేణులతో గురువారం సమావేశమై ఓటింగ్ సరళిపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ఆసక్తి చూపించారన్నారు. అందుకు నిదర్శనం మాడుగులలో అత్యధికంగా పోలింగ్ జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ ఇన్చార్జ్ పివిజి కుమార్, పైలా ప్రసాదరావు, నాలుగు మండలాల కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామం అంధకారంలో మగ్గుతుంది. గ్రామంలోని మెయిన్ రోడ్డు ఆంజనేయ స్వామి గుడి ప్రాంతంలో వారం రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో రోడ్డుపై ప్రయాణించే వారు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే వద్దులు చిన్నారులు రోడ్డుకి రావడానికి భయపడుతున్నారు. మరోపక్క అడపా దడపా వర్షాలు పడటంతో పురుగు పుట్ర రోడ్డు పైకి వస్తే ఎవరికి ఏ ప్రమాదం సంభవిస్తుందని మహిళలు చిన్నారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్లు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో లైన్ వర్కర్ మృతి

కంపెనీ వద్ద మాట్లాడుతున్న టిడిపి నాయకులు గండి బాబ్జీ

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని ఆరిపాక గ్రామానికి చెందిన ఏపీఈపీడీసీఎల్ లైన్ వర్కర్ (హెల్పర్) గొంప వెంకటరమణ (48) విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... ఆరిపాక గ్రామానికి చెందిన గొంప వెంకటరమణ ఏపీఈపీడీసీఎల్లో లైన్ వర్కర్ (హెల్పర్)గా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా వెంకటరమణ గురువారం గాలి భీమవరం కోరమండల్ మెట్ కోక్ ఇండస్ట్రీలో విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి వెళ్లి ట్రాన్స్ఫార్మర్ వద్ద పనిచేస్తుండగా విద్యుత్ షాక్కు గురై అక్కడే మృతి చెందాడు. వెంకటరమణకు భార్య సూర్యకళ, కుమార్తె భాగ్యశ్రీ, కుమారుడు ప్రదీప్ ఉన్నారు. వెంకట రమణ మృతి పట్ల గ్రామస్తులు, బంధువులు శోక సంద్రంలో మునిగారు. ఈ సమాచారం తెలుసుకున్న పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గండి బాబ్జి కోరమండల్ మెట్ కోక్ ఇండస్ట్రీలోని సంఘటనా స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కంపెనీ యాజమాన్యం మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కంపెనీలో యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆరిపాక గ్రామ నాయకులు వి.రమేష్ రాజు, పిన్నమరాజు సత్యనారాయణరాజు, శరకడం రాము, శరగడం శంకర్రావు, అంది బోయిన బంగారయ్య, పైడం నాయుడు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకటరమణ మృతదేహం

లైన్మ్యాన్ కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలి : సిఐటియు

అనకాపల్లి : సబ్బవరం మండలం ఆరిపాక దగ్గర బొగ్గు కంపెనీ వద్ద గురువారం విధి నిర్వహణలో కరెంట్ షాక్తో మరణించిన ఆరిపాక ఫీడర్ లైన్మ్యాన్ గొంప వెంకట రమణ(40) కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంకటరమణ గత 13 సంవత్సరాలుగా అసిస్టెంగా గ్రామీణ విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్నారని, ప్రభుత్వం ఆయన కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని కోరారు.

భారమౌతున్న పశుపోషణ!

- వరి సాగు విస్తీర్ణం తగ్గడంతో పశుగ్రాసానికి కొరత
- ఇతర జిల్లాల నుంచి దిగుమతితో పెరిగిన ఎండు గడ్డి ధర
- మండుటెండలతో మూగజీవాలకు తాగునీటికి కటకట

మేతకు అలమటిస్తున్న పాడి పశువులు

ప్రజాశక్తి- నక్కపల్లి : పల్లెల్లో పశుగ్రాసం కొరతతో పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండిగడ్డి లేకపోవడంతో రైతన్నకు పశువుల పోషణ భారమైంది. రైతులు కూలీ, నాలీ చేసుకుంటూ, దానితోపాటు పాడి పశులను మేపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అయితే వేసవి వచ్చిందంటే పశుపోషణ కష్టమే. ఎండ తీవ్రతకు పొలాల్లో ఎక్కడా పచ్చగడ్డి లేని పరిస్థితి ఉంది. పశువులకు మేత సరిగ్గా లభించకపోవడంతో బక్కచిక్కుతున్నాయి. పొలాలన్నీ బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. విస్తారంగా వర్షాలు కురిస్తే తప్ప అప్పటివరకు గడ్డి ఇబ్బందులు తప్పేటట్టు లేదు. పోనీ ఎండు వరిగడ్డి మేతగా వేద్దామంటే అది లభ్యం అవ్వడం లేదు. గత ఏడాది ఖరీఫ్ సీజన్ లో వర్షాలు ముఖం చాటేయడంతో అన్నదాతకు వరిగడ్డి కూడా కరువైంది. మండలంలో సుమారుగా 5000 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తుంటారు.వర్షాలు సమృద్ధిగా పడినట్లయితే , 5000 ఎకరాల్లోనూ వరి పంట చేతికొస్తుంది. రైతులు తమకు కావలసిన వరిగడ్డిని ఉంచుకుని,అవసరం లేని వారు స్థానిక పాడి రైతులకు విక్రయిస్తూ ఉంటారు. అయితే ఖరీఫ్ సీజన్లో 1000 ఎకరాల్లో కూడా వరి సాగు లేకపోవడంతో ,మండలంలో ఎండి గడ్డి కొరత తీవ్రమైంది. కాకినాడ జిల్లాలో పలు మండలాల నుంచి వ్యాపారులు ట్రాక్టర్ పై ఎండు గడ్డి తీసుకువచ్చి ఈ గ్రామాల్లో విక్రయిస్తున్నారు. ఎండు గడ్డి దిగుబడి తగ్గడంతో ధర విపరీతంగా పెరిగింది.గతంలో ట్రాక్టర్ గడ్డి రూ.10 వేలు లోపు విక్రయిస్తే, ఇప్పుడు 12 వేల నుండి 13 వేల రూపాయల వరకు ధర పలుకుతుంది.ఎండు గడ్డికి డిమాండ్ పెరగడంతో గడ్డి ట్రాక్టర్లు కూడా ఎక్కువ రాని పరిస్థితి నెలకొంది. గడ్డి ధర పైపైకి చేరడంతో పాడి రైతులు గడ్డి కొనుగోలు చేసేందుకు హడలిపోతున్నారు. గడ్డి గిరాకి కావడంతో తప్పనిసరి పరిస్థితిలో ధర ఎంత ఎక్కువైనా పశుపోషణ కోసం కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. కొంతమంది పాడి రైతులు అప్పులు చేసి ఎండు గడ్డిని కొనుగోలు చేసుకుంటున్నారు. మరోవైపు ప్రస్తుతం వేసవి సీజన్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది.బావుల్లో, చెరువుల్లోనూ నీరు అడుగంటాయి. కనీసం పశువులకు దాహార్తిని తీర్చే పరిస్థితి కూడా కనిపించలేదు.పాడి రైతులు చాలా ఇబ్బందులు పడుతూ పశువులను మేపుతున్నారు. విస్తారంగా వర్షాలు పడితే కానీ పాడిరైతు కష్టాల నుండి బయటపడేటట్టు కనిపించలేదు.

ట్రాక్టర్‌తో ఎండి గడ్డిని తీసుకువచ్చి విక్రయిస్తున్న వ్యాపారులు

విభిన్న అంశాలపై వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్. : మహిళలు, బాలికలు, కెరీర్ కౌన్సెలింగ్, కెరీర్ గైడెన్స్ ప్రధాన అంశాలుగా పనిచేస్తున్న ఉరివి విక్రమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన డ్రెస్ మేకింగ్, పాట్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, ఆర్య వర్క్, మగ్గం వర్క్‌లలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి. హరి వెంకట రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల సందర్భంగా సంస్థ 45 రోజులపాటు ఈ శిక్షణలను అందజేస్తోందని పేర్కొన్నారు. ఆరిలోవ దుర్గానగర్ వద్ద వున్న సంస్థ కార్యాలయానికి నేరుగావొచ్చికానీ, సీనియర్ శిక్షకురాలు జి.సావిత్రిని 7093429202 నెంబరులో సంప్రదించిగానీ పేర్లు నమోదు చేసుకోవొచ్చని తెలిపాఉ. ఈ శిక్షణా కార్యక్రమాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు.

చీడికాడ : స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 15నుంచి వచ్చేనెల ఏడో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ ఎంఎస్ఎల్ జోగేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయానికి పిల్లలను రప్పించి, వారికి వేసవి సెలవులు సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా చేసే క్రమంలో వివిధ రకాల పోటీలు, విభిన్న అంశాల్లో నైపుణ్యం పెంపు, ముఖ్యంగా పఠనాశక్తికి కలిగించేలా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. విద్యార్థులలో దాగివున్న చిత్రకళ నైపుణ్యం, ఆటలు పాటలలో రాణించేలా వారిని ప్రోత్సాహించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సెల్‌ఫోన్, టివిలకు అతుక్కుపోయే విధానానికి స్వస్తి చెప్పి, పిల్లలలందూ ఒక చోటుకు చేరి, వారి అభిప్రాయాలను పరస్పరం పంచుకునేలా చేస్తామన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.దయమంతి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞానశిబిరం ప్రారంభించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. కొమరవోలు జెడ్‌పిహెచ్ఎస్ సోషల్ అసిసెంట్ సిహెచ్.రాంకుమార్ పాల్గొని విద్యార్థులకు పుస్తక పఠనం వలన ప్రయోజనాలు, అందించే జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని వివరించారు. డబ్ల్యూడబ్ల్యూ పిసి సిహెచ్.భవానీ జనరల్ నాలెడ్జి గురించి వివరించగా, దినపత్రికలు చదవడం వల్ల కలిగే లాభాలను, రోజూ న్యూస్‌పేపర్లను చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ రిక్రియేషన్ గేమ్ ఆడించి విద్యార్థులను ఉత్సహపరిచారు.

గాజువాక : పెదగంట్యాడ గ్రంథాలయంలో గురువారం నుంచి వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 12 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులతో కథల పుస్తకాలను గ్రంథాలయాధికారి చదివించారు. వారి చేత కథలు కూడా చెప్పించారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

జెసిబిలతో మురుగుకాలువల్లో పూడికతీతలు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం మున్సిపాలిటీలో గురువారం డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు ఆధ్వర్యంలో జెసిబి సాయంతో మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి, శ్రీకన్య డౌన్ తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులను చేపట్టారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువల్లో పూడికలు పేరుకుపోయి, పారిశుధ్యానికి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో శానిటేషన్ పనులు చేపడుతున్నట్లు చిట్టిబాబు తెలిపారు.

అధిక రసాయనాల వినియోగంతో అనర్థం

మత్సవానిపాలెం రైతు సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయశాస్త్రవేత్త

ప్రజాశక్తి -కొత్తకోట : అధిక రసాయనాల ఉపయోగిస్తే అనర్థమని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మోషే, స్కైకాస్ అన్నారు. గురువారం కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయం,పని అనుభవ కార్యక్రమంలో భాగంగా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్కైకాస్ కళాశాల విద్యార్థులు మత్సవానిపాలెం గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మోషే, స్కైకాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రైతులు పడుతున్న ఇబ్బందులను వ్యవసాయకళాశాల విద్యార్థులు తెలుసుకొనుటకు ఇది చక్కని కార్యక్రమ మన్నారు. ఈసందర్భంగా నూతన సాంకేతికను తెలియజేసేలా విద్యార్థులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో ప్రాజెక్టులను గురించి రైతులకు శాస్త్రవేత్తలు పరిశీలించారు. అధిక రసాయనాల ఉపయోగిస్తే ఎటువంటి అనర్థాలు జరుగుతాయో నాటకం రూపంలో రైతులకు వివరించారు. ఆనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. రాజ్ కుమార్, శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎన్. సత్తిబాబు, కిషోర్ కుమార్ బాబు, సర్పంచ్ గణేష్, ఎంపీటీసీ లోవరాజు, మాజీ సర్పంచ్ తాతబాబు, ఉప సర్పంచ్ సత్తిబాబు, పలువురు రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు .తుని వైపు నుంచి నక్కపల్లి వైపు వస్తున్న వ్యాన్, గొడిచెర్ల వద్దకు వచ్చేసరికి వ్యాన్ ముందు వెళ్తున్న లారీ సడన్‌గా నిలుపుదల చేయడంతో ఢీకొట్టింది .ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు .వ్యాన్ ముందుభాగం ప్రమాదంలో దెబ్బతింది .పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు .

జగన్ మాటలతో వైసిపిలో ఉత్సాహం

ప్రజాశక్తి -నక్కపల్లి : సరికొత్త చరిత్ర సష్టించబోతున్నామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడంతో వైసిపి శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. గురువారం విజయవాడలో జగన్ ఐప్యాక్ టీంను అభినందించి ,చేసిన వ్యాఖ్యలు వైసిపిలో కొత్త ఉత్సాహాన్ని తెచ్చింది. రాష్ట్రంలో 151 అసెంబ్లీ, 23 పార్లమెంటు స్థానాలను దాటి వైసిపి కైవసం చేసుకొని సరికొత్త చరిత్రను సృష్టించబోతున్నామని చెప్పడంతో వైసిసి శ్రేణులు ఆనందం వ్యక్తం చేసి సంబరాలు చేసుకుంటున్నాయి. వైసిపి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని స్థానిక వైసిపి నాయకులు ,కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

ఫల సాయం పరుల పాలు!

- చోద్యం చూస్తున్న అధికారులు

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొబ్బరితోట

ప్రజాశక్తి -కోటవురట్ల:. మండల కేంద్రం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని కొబ్బరి చెట్ల ఫలసాయం పరుల పాలవుతోంది. అయినా అధికారులు చోద్యం చూస్తూ ఉన్నారు, కార్యాలయ ఆవరణలో దాదాపు 60వరకు కొబ్బరి చెట్లు ఉన్నాయి. గడిచిన దశాబ్ద కాలంగా కొబ్బరికాయలకు విపరీతమైన గిరాకీ, మార్కెట్ ఉన్నా, కార్యాలయ ఆవరణలోని చెట్ల ఫలసాయాన్ని సద్వినియోగం చేసే పరిస్థితిలేదు. కొబ్బరిచెట్ల ఫలసాయాన్ని వేలం వేసినా దాదాపుగారూ. లక్ష వరకు ఆదాయం వచ్చేదని స్థానిక వ్యాపారులే అంచనా వేస్తున్నారు అటువంటి ఆదాయాన్ని అధికారుల నిర్లక్ష్యం చేయడంతో ఫల సాయం పరుల పాలౌతోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు, కొబ్బరి చెట్లకు వేలంపాట నిర్వహించకపోవడంతో వాటి సంరక్షణ కూడా అంతంత మాత్రమే ఉండడంతో కొన్ని చెట్లు చనిపోతున్నాయి, ఇప్పటికైనా అధికారులు స్పందించి, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని కొబ్బరి చెట్ల సస్యరక్షణతోపాటు వాటి ఫలసాయం పరుల పాలవ్వకుండా సద్వినియోగం చేసే చర్యలు చేపట్టాలని పలువురు, పలు సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి రాజీవ్ నగర్ కాలనీలో గురువారం వరసిద్ధి వినాయక ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామి దర్శించుకున్నారు .మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

సైనిక్ స్కూల్‌లో ప్రవేశానికి
జి.కోడూరు విద్యార్థి ఎంపిక

గంగిరెడ్ల తనుష్‌కుమార్

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : మాకవరపాలెం మండలంలోని జి కోడూరు గ్రామానికి చెందిన విద్యార్థి గంగిరెడ్ల తనుష్‌కుమార్ సైనిక్ స్కూలులో ప్రవేశానికి ఎంపికయ్యాడు. స్థానిక ఎస్‌జికె పాఠశాలలో చదువుతున్న గంగిరెడ్ల తనుష్‌కుమార్ సైనిక్ స్కూల్లో ఆరోతరగతిలో ప్రవేశానికి పరీక్ష రాశాడు. ఈ పరీక్షలో ఉత్తీర్ణతతోపాటు మంచి మార్కులు, ర్యాంకు సాధించడంతో రాజస్థాన్‌లోని గంగానగర్ సైనిక్ స్కూలులో ప్రవేశానికి ఎంపికయ్యాడని పాఠశాల కరస్పాండెంట్ వీరప్రకాశ్ తెలిపారు. ఈమేరకు రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లోని ఎంఎస్‌ఎం సైనిక స్కూల్‌లో తనుష్‌కుమార్‌కు ప్రవేశార్హత వచ్చిందని అక్కడి పాఠశాల నుంచి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందింది. కాగా తనుష్ కుమార్‌కు రాజస్థాన్‌లోని సైనిక్‌స్కూల్‌లో సీటు దక్కడంపై తనుష్‌తోపాటు అతని తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్‌తోపాటుపలువురు అభినందించారు.

ఇగ్నోలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జూలై 2024 విద్యాసంవత్సరానికిగాను వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు వర్సిటీ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. అన్ని కోర్సులలో జూన్ 30వ తేదీలోపు https://ignouadmission. samarth. edu.in ద్వారా ప్రవేశాలు పొందాలని కోరారు. వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఐదు రకాల ఎంబిఎ డిగ్రీలను ఇగ్నో అందిస్తోందని తెలిపారు. మరింత సమాచారానికి ఇగ్నో అధ్యయన కేంద్రాలనుగానీ, ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్నిగానీ సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. 0891-2511200 ఫోన్ నెంబరును అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

యువ క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డాబర్ గ్లూకోజ్ యువకుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడానికి, వారిలో శక్తి, సత్తువ పాముఖ్యతపై అవగాహన కల్పించడానికి 'ఎనర్జైజ్ ఇండియా' మెగా క్యాంపెయిన్‌ను గురువారం విశాఖలో ప్రారంభించింది భారతదేశం అంతటా ప్రధాన క్రీడా అకాడమీలలో నిర్వహించనున్న ప్రచారంలో భాగంగా విశాఖలోని ఎస్‌టిసి ఎస్‌ఎఐ బాక్సింగ్ అకాడమీలో ఎనర్జీ స్టామినా మేనేజ్‌మెంట్‌పై ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు ఈ ప్రత్యేక అవగాహన సెషన్‌ను నిర్వహించారు. అనంతరం డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్-హెల్త్ సప్లిమెంట్స్ ప్రశాంత్ అగర్వాల్ మాట్లాడుతూ యువ అథ్లెట్లలో శక్తి, సత్తువ ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి 'ఎనర్జైజ్ ఇండియా' ప్రచారాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురిని సత్కరించారు. డాబర్ ఇండియాకు చెందిన దినేష్ కుమార్, ఉషా నాగిశెట్టి, ఎం.దుర్గారావు, అమోల్ హండే తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం 32/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ పెదబొడ్డేపల్లి డివిజనల్ ఇంజనీర్ విడివి.రామకృష్ణారావు తెలిపారు. విద్యుత్ లైన్, సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణ పనులు దృష్ట్యా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బలిఘట్టం, బైపురెడ్డిపాలెం, మెట్టపాలెం, బెన్నవరం, ఏటిగైరంపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సమస్యల వలయంలో అగ్నిమాపక కేంద్రం

- వసతి సమస్యతో చెట్టు కిందనే సిబ్బంది
- కండిషన్ లేని వాహనంతో ఇబ్బందులు
- మోటారు లేక వేధిస్తోన్న నీటి సమస్య
- పిపిపిలో నిర్వహణతో వేతన సమస్యలు

శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్డు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం అగ్నిమాపక కేంద్రానికి సవాలక్ష సమస్యలు వెంటాడుతున్నాయి. శిథిలావస్థలో రేకుల షెడ్డు, తరచూ మొరాయించే పాత అగ్నిమాపక శకటం, అందులో నీరు నింపడానికి అందుబాటులో నీటి సౌకర్యం లేకపోవడం ఇలా ఒక్కటేమిటి అన్నీ సమస్యలే. అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే అగ్నిమాపక విభాగంలో ఇలా సమస్యలుంటే, ప్రమాదం జరిగినప్పుడు వెళ్లి మంటలను అదుపు చేయడం సాధ్యమేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అగ్నిమాపక కేంద్రం వద్ద బోరు పాయింట్ ఉన్నప్పటికీ, దానికి మోటారు బిగించడంగానీ, ట్యాంకరు సదుపాయం గానీ లేకపోవడంతో ఎక్కడి నుంచెనా అత్యవసర ఫైర్ కాల్ వస్తే, వాహనంలో నీరు నింపడానికి వ్యవసాయ బావులు, కొండ గెడ్డలు, చెరువుల పరుగులు తీయాల్సిన దుస్థితి. అక్కడ నీరుని నింపుకొని సంఘటనా స్థలానికి వెళ్లాల్సిన పరిస్థితిలో ఆస్తినష్టం జరగకుండా నివారించడం ఎంత వరకు సాధ్యమనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. నీరు నింపుకుని, అగ్నిమాపక శకటం సంఘటనాస్థలికి చేరుకునేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.

మోటార్ లేని బోర్

తరుచూ మొరాయిస్తున్న అగ్నిమాపక శకటం

వేతనాలు అందక సిబ్బది అవస్థలు

ఇక్కడ పనిచేసే 16 మంది ఫైర్ సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించలేని దుస్థితి అ శాఖకు ఉంది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వా మ్యంతో 15 ఏళ్ల కిందట ఇక్కడ అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం నిర్వహణను విశాఖకు చెందిన గుత్తేదారు (సర్వీస్ ప్రొవైడర్) పర్యవేక్షిస్తున్నాడు. దీంతో వీరికి ఎపుడు వేతనం వస్తుందో తెలియని స్థితి ఉందని అంటున్నారు.

కేంద్రం వద్ద నీటి అవసరాలు తీర్చేందుకు బోరు, మోటారు సదుపాయం తప్పనిసరిగా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడ నుంచి ఫైర్ కాల్ వచ్చినా వెంటనే అక్కడికి వెళ్లేలా శకటం ఎప్పుడూ నీటితో సిద్ధంగా ఉండాలి. ఈ ప్రాంతంలో అధికంగా వరి కుప్పలు, చెరకు, సరుగుడు. జీడి తోటలు. పశువుల పాకల అగ్ని ప్రమాదాలు తరచూ జరుగుతుంటాయి. వేసవిలో వారానికి అయిదు నుంచి ఆరు వరకు ఫైర్ కాల్స్ వస్తూ ఉంటాయి. ఐదు కిలోమీటర్లదూరంలోని పి పొన్నవోలు వ్యవసాయ బావి, లేదా కింతలి రహదారిలో చెరువుల వద్దకు వెళ్లి నీరు నింపుతుంటారు.. సిబ్బంది విధులు నిర్వహణ సరైన కార్యాలయం లేదు ఉన్న రేకుల షెడ్డు శిథిలం కావడంతో రంధ్రాలు పడి వర్షానికి కారిపోతుంది. అన్ని వసతుల్ని సమకూర్చి, అగ్నిమాపక కేంద్రం సేవల్ని మరింత చేరువ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎపిఆర్‌ఎస్‌లో వీనస్ విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించిన పెదపూడి త్రిపుర

పెదపూడి త్రిపుర

ప్రజాశక్తి - మాడుగుల: ఇటీవల విడుదలైన ఎపిఆర్‌ఎస్, ఎపిఆర్‌జెసి ఫలితాలలో మాడుగుల విద్యార్థిని పెదపూడి త్రిపుర రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించి సత్తా చాటింది. మాడుగులకు చెందిన వీనస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఎపిఆర్‌ఎస్, ఎపిఆర్‌జెసి రెండు ఫలితాల్లోనూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ తాళపు రెడ్డి నాగచంద్ర తెలిపారు. వీనస్ కోచింగ్ సెంటర్‌లో తర్ఫీదు పొందిన పెదపూడి త్రిపుర ఎపిఆర్‌ఎస్ రాష్ట్రస్థాయి 6వ ర్యాంక్ సాధించగా, వేపాడ పూర్ణచంద్రరావు ఎపిఆర్‌జెసిలో రాష్ట్రస్థాయిలో 16వ ర్యాంక్, ఏడాకుల పావని 51వ ర్యాంకు, కటకం జయంత్ 184వ ర్యాంకు, దాసరి రామ్‌చరణ్ 342వ ర్యాంకు, తామరపల్లి హేమన్య 67వ ర్యాంకు, చింతపల్లి హైమావతి 1043వ ర్యాంకులను వరుసగా సంపాదించారని కరస్పాండెంట్ చంద్ర తెలిపారు. మీరంతా ఈనెల 20వ తేదీన గుంటూరులో జరగబోవు కౌన్సిలింగ్‌లో పాల్గొంటారని తాళపురెడ్డి నాగచందర్ తెలిపారు. మారుమూల గ్రామాలకు చెందిన తమ పిల్లలకు ప్రవేశపరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంకుల సాధించేలా శిక్షణనిస్తున్న వీనస్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ తాళ్లపురెడ్డి నాగచంద్రకు విద్యార్థులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు దంగేటి సూర్యరావు, శ్రీనాధు శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, భారత నిర్మాణ సేన గౌరీపట్టపు మహేష్ కుమార్, తల్లిదండ్రులు ఇనిస్టిట్యూట్ యాజమాన్యానికి,పిల్లలకూ అభినందనలు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న గ్రామపెద్దలు

సమ్మర్‌లో కూల్ ..కూల్!

విశాఖ నగరంలో జోరున కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-నక్కపల్లి: వేసవి తాపానికి అల్లాడుతున్న జనం వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని కొద్దిపాటి వర్షం కురిసింది .దీంతో రోజంతా చల్లబడింది. రెండు నెలల నుంచి భానుడు నిప్పులు గక్కడంతో ఉష్ణతాపానికి ప్రజలు విలవిలలాడారు. గురువారం రోజంతా ఆకాశం మేఘావతమై ,చల్లటి గాలులు వీస్తూ,చిరుజల్లులు కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడడంతో ప్రజలు సేద తీరారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఉపశమనం పొందారు. తెల్లవారుజామున ఆకాశంలో చీకటి కమ్ముకుని వర్షం కురవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు.కాగా విశాఖ నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాలతో మోస్తరు వర్షం కురిసింది.

నక్కపల్లిలో పట్టపగలే లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు